





భయపడటం చాలామందికి ఇష్టం. అందుకే భయపెట్టడం ఓ వ్యాపారమైంది. డబ్బిచ్చి మరీ భయాన్ని కొనుక్కునే వాళ్లు భూమ్మీద కోకొల్లలు. కొందరు క్రియేటివ్ జీనియస్‌లు జనాన్ని భయపెట్టడంలో రకరకాల మార్గాలను అన్వేషిస్తుంటారు. వాస్తవ ప్రపంచంలో జల్లెడ పట్టి వెతికినా కనిపించని ఆత్మలకు రూపాన్ని ఇచ్చేసి.. వాటిని ప్రేతాత్మలుగా మార్చేసి.. వాటితో విచిత్రమైన విన్యాసాలు చేయించేసి ఆడియన్స్‌ని భయపెట్టేస్తుంటారు. మాయా ప్రపంచంలో విహరించడంలో.. అడ్వెంచర్లను ఎక్స్‌పీరియన్స్ చేయడంలో ఆనందాన్ని వెతుక్కునే ప్రేక్షకదేవుళ్లు ఈ తరహా సినిమాలను తెగ ఆరాధించేస్తుంటారు... పనిలో పనిగా ఆదరించేస్తుంటారు. ఈ హారర్‌కు ఎక్కువ మోతాదులో కామెడీని యాడ్ చేస్తున్నారు. దీంతో ప్రేక్షకులు భయపడుతూనే పడిపడి నవ్వుతున్నారు.

# భయపెడుతూ.. నవ్విస్తూ..

భయపెట్టే సినిమాల్లో 'ఈవిల్ డెడ్' ఓ మాస్టర్ పీస్. 1981 నుంచి 2023 వరకూ ఈ ఫ్రాంచైజీలో అయిదు సినిమాలొచ్చాయి. త్వరలో ఆరో సినిమా కూడా రాబోతున్నది. 'ఈవిల్ డెడ్'కి పూర్వం కూడా హాలీవుడ్‌లో భయపెట్టే సినిమాలు చాలానే వచ్చాయి. కాకపోతే.. 'ఈవిల్ డెడ్' మాత్రం ఓ ట్రెండ్ సెట్టర్. ఇక మనదేశం విషయానికొస్తే.. ఈ తరహా సినిమాలకు కేరాఫ్ అడ్రస్ రామ్సే బ్రదర్స్. హారర్ సినిమాలు తీయడంలో వీళ్లు మాస్టర్లు. వీరి దర్శకత్వంలో దర్వాజా, ఔర్ కౌన్, పురానామందిర్, దహ్‌శత్, విరానా, పురానీ హవేలీ, బంద్ దర్వాజా.. ఇలా చాలా హారర్ సినిమాలే వచ్చాయి. అవి తెలుగులో కూడా బాగా ఆడాయి.

**70ల్లో** కన్నడంలో అనంతనాగ్ హీరోగా వచ్చిన 'నా నిన్న బిడలారె' సినిమా.. తెలుగులో 'గాయత్రి' పేరుతో రిలీజై ఇక్కడి ప్రేక్షకుల కంటికి కునుకు లేకుండా చేసింది. ఈ సినిమా ప్రేరణగా తర్వాత చాలా హారర్ సినిమాలొచ్చాయి. హీరో ఒక అమ్మాయిని ప్రేమించడం. ఆ అమ్మాయి కొందరి వల్ల మోసపోయి ప్రాణాలు కోల్పోవడం. ప్రేమించిన అమ్మాయి కనిపించకపోవడంతో హీరో మరో స్త్రీని పెళ్లాడటం. దాంతో కోరిక తీరకుండా ప్రాణాలు పోగొట్టుకున్న ఆ అమ్మాయి భూతంగా మారడం. తన చావుకు కారణమైన వారిపై పగ తీర్చుకోవడం.. ప్రేమించిన ప్రియుడి ఫ్యామిలీని ఇబ్బంది పెట్టడం.. దాదాపుగా ఇదే కథాంశంతో ఓ 20 సినిమాలు వచ్చి ఉంటాయి. వీటన్నిటికీ 'గాయత్రి' సినిమానే ప్రేరణ. ఈ చిత్రం తర్వాత ఆ స్థాయి విజయాన్ని సాధించిన హారర్ సినిమా అంటే 'కాళరాత్రి'నే చెప్పుకోవాలి. మలయాళంలో రూపొందిన ఈ సినిమా తెలుగులో కూడా చాలా పెద్ద హిట్. 80ల్లో హారర్ సినిమాలకు తెలుగునాట

> ఇక రామ్‌గోపాల్‌వర్మ ఆగమనంతో భారత్‌లో హారర్ సినిమాల శకం మొదలైంది. ఆయన తీసిన తొలి హారర్ సినిమా 'రాత్రి' పెద్దగా ఆడకపోయినా.. ఈ జానర్ సినిమాలకు ట్రెండ్ సెట్టర్ అయింది. రెండున్నర గంటలపాటు దెయ్యాన్ని చూపించకుండా కేవలం కెమెరాతోనే భయపెట్టాడు వర్మ. క్లయిమాక్స్‌లో దెయ్యాన్ని చూపిస్తాడు. నిజంగా టెర్రర్ పుట్టిస్తుందా సీన్. తెలుగులో రామ్‌గోపాల్‌వర్మ తీసిన మరో హారర్ సినిమా 'దెయ్యం'. సినిమా బావుంటుంది. అయితే.. పతాక సన్నివేశాల విషయంలోనే వర్మ విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. బాలీవుడ్‌లో ఆయన తీసిన 'భూత్' సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఏదేమైనా.. హారర్ సినిమాల ద్వారా హాలీవుడ్ టేకింగ్‌ని రామ్‌గోపాల్‌వర్మ భారతీయ సినిమాకు పరిచయం చేశాడు.

కూడా మంచి గిరాకీ ఉండేది. ఇంటి నెం.13, క్షణ క్షణం భయం భయం, పున్నమిరాత్రి.. ఇలా చాలా హారర్ సినిమాలు ఆ ఎరాలోనే వచ్చి బాగా ఆడాయి.

**ఇక** హారర్‌ని కొత్తకోణంలో ఆవిష్కరించిన సినిమా రజనీకాంత్ 'చంద్రముఖి'. మలయాళంలో మోహన్‌లాల్ కథానాయకుడిగా రూపొందిన 'మణిచిత్రతాజు' చిత్రానికి రీమేక్‌గా వచ్చిన 'చంద్రముఖి' హారర్ కామెడీ అనే కొత్త జానర్‌ని తెలుగుతెరకు పరిచయం చేసింది. సాధారణంగా హారర్ సినిమాల్లో కనిపించని హీరోయిజం, కామెడీ, కళాత్మక కోణం 'చంద్రముఖి'లో కనిపించడంతో ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనయ్యారు. దాంతో మాతృకకు మించిన విజయాన్ని 'చంద్రముఖి'కి అందించారు.

**'చంద్రముఖి'లో** కామెడీని లైట్‌గా టచ్ చేస్తే.. పూర్తి హారర్ కామెడీ కథాంశంతో సినిమా తీసి తొలి విజయాన్ని అందుకున్నాడు డ్యాన్స్ మాస్టర్ లారెన్స్. ఆ సినిమానే 'ముని'. 2007లో వచ్చిన ఈ చిత్రంలో తాను పోషించిన 'రాఘవ' పాత్రను కొనసాగిస్తూ.. 'కాంచన', 'కాంచన 2', 'కాంచన 3' సినిమాలను తెరకెక్కించాడు లారెన్స్. ఈ ఫ్రాంచైజీలో ప్రతి సినిమా సూపర్ హిట్ కావడం విశేషం. డ్యాన్స్ మాస్టర్ లారెన్స్‌ని, అటు దర్శకునిగా, ఇటు హీరోగా కూడా నిలబెట్టింది 'కాంచన'. ఇక 2013లో వచ్చిన అచ్చ తెలుగు హారర్ కామెడీ 'ప్రేమకథా చిత్రమ్'. దర్శకుడు మారుతి దర్శకత్వ పర్యవేక్షణలో జె.ప్రభాకర్‌రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాల ప్రేరణగా రాజుగారి గది, భాగమతి, గీతాంజలి, జాంబిరెడ్డి, ఆనందోబ్రహ్మ, నిను వీడని నీడను నేనే చిత్రాలు విడుదలై విజయాలను అందుకున్నాయి. ఇదే ప్యాట్రన్‌లో వచ్చి చేతులు కాల్చుకున్న సినిమాలు కూడా చాలా ఉన్నాయి.




**నిజంగా** కొన్నాళ్లపాటు టాలీవుడ్‌లో హారర్ కామెడీ రాజ్యమేలిందనే చెప్పాలి. వీటి మధ్యలో సీరియస్‌గా ఓ హారర్ సినిమాను తీసి నిజంగా ఆడియన్స్‌ని భయపెట్టాడు దర్శకుడు సాయికిరణ్. ఆ సినిమా పేరు 'మసూద'(2022). చాలా తక్కువ బడ్జెట్‌లో రూపొందిన ఈ చిత్రం దాదాపు రూ.15 కోట్ల వసూళ్లను రాబట్టి, బయ్యర్లకు భారీ లాభాలు తెచ్చిపెట్టింది.

**ఈ** సందర్భంలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది ప్రభాస్ నటిస్తున్న 'ది రాజా సాబ్' సినిమా గురించి. రజనీకాంత్, అనంతనాగ్, మోహన్‌లాల్ వంటి సూపర్‌స్టార్లు హారర్ సినిమాల్లో నటించి విజయాలను సాధించారు. అయితే హారర్ కామెడీ సినిమాలో మాత్రం ఏ సూపర్ స్టార్ నటించలేదు. తొలిసారి ప్రభాస్ నటిస్తున్నాడు. ఇందులో ఆయన దెయ్యంగా భయపెడతాడా? దెయ్యాన్ని చూసి భయపడతాడా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. పాన్ ఇండియా స్థాయిలో, దాదాపు రూ.400 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ఏడాదే సినిమా విడుదల కానుంది.

**చివరిగా** చెప్పొచ్చేదేంటంటే.. మేకర్స్‌కు భయపెట్టడమే పెద్ద టాస్క్. భయపెడుతూ నవ్వించడం ఇంకా పెద్ద టాస్క్. ఈ విషయంలో ఏ మాత్రం తడబడ్డా ఫలితం భయపెట్టడం ఖాయం. నవ్వించడం దేవుడెగురు.. నవ్వుల పాలవ్వాల్సి వస్తుంది.

... బుర్రా నరసింహా

## » ఆమె అద్భుతమైన అమ్మ!



**తన** కూతురు అతియా శెట్టిని.. 'ఓ అద్భుతమైన అమ్మ!'గా వర్ణిస్తున్నాడు బాలీవుడ్ వెటరన్ స్టార్ సునీల్ శెట్టి. ప్రసవ సమయంలో సి–సెక్షన్‌కు బదులుగా నార్మల్ డెలివరీని ఎంచుకున్న తన బిడ్డను చూస్తే ఎంతో గర్వంగా ఉన్నదని అంటున్నాడు. సునీల్ శెట్టి కుమార్తె అతియా శెట్టి ఈ ఏడాది మార్చిలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. అయితే, ప్రసవం కోసం అతియా 'నార్మల్ డెలివరీ' జరగాలని నిర్ణయం తీసుకున్నది. ఈ విషయంపై సునీల్ శెట్టి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అతియాపై ప్రశంసలు కురిపించాడు. ''ఇప్పుడు చాలామంది సిజేరియన్ ద్వారానే పిల్లల్ని కంటున్నారు. నొప్పుల బాధలేకుండా.. సౌకర్యాన్ని మాత్రమే కోరుకుంటున్నారు. అలాంటి సమయంలో నా బిడ్డ.. సహజ ప్రసవాన్ని ఎంచుకున్నది. ఆమె ఎంతో ధైర్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయం మమ్మల్నే కాదు.. డాక్టర్లను కూడా ఎంతో ఆశ్చర్యానికి గురిచేసింది. నా బిడ్డ.. ఎంతో ఎదిగింది'' అంటూ అతియాను ఆకాశానికి ఎత్తేశాడు. ఇక తన బిడ్డను అద్భుతమైన తల్లిగా అభివర్ణిస్తూ.. ''ఆమె తల్లి మానాశెట్టి కూడా ఎంతో దృఢమైన మహిళ. అతియా ఆమె నుంచే అన్నీ నేర్చుకున్నది. ఎలాంటి సందర్భంలోనైనా ముఖంలో అలసట, ఒత్తిడి అనేది లేకుండా.. చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది. బిడ్డగానే కాదు.. తల్లిగానూ తప్పకుండా సక్సెస్ అవుతుంది'' అంటూ చెప్పుకొచ్చాడు. అయితే, ''అతియా నార్మల్ డెలివరీని తట్టుకుంటుందా? అని నేను కూడా మొదట్లో అనుమానపడ్డా. కానీ, ఆమె మాత్రం తన బిడ్డను సహజంగానే ఈ లోకంలోకి తీసుకురావాలని కోరుకుంది. ఆమె ఆలోచన ఎంతో గొప్పది'' అంటూ వెల్లడించాడు. 2015లో నిఖిల్ అద్వానీ దర్శకత్వంలో వచ్చిన రొమాంటిక్ యాక్షన్ చిత్రం 'హీరో'తో నటనా రంగ ప్రవేశం చేసింది అతియా. ఆ తర్వాత ముబారకన్, మోతీచూర్ ఛాక్నచూర్ లాంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నది. 2023లో తన స్నేహితుడు, భారత జట్టు క్రికెటర్ కేఎల్ రాహుల్‌ను వివాహం చేసుకున్నది.



## అగ్గిపుల్లలా.. ఆటపట్టించారు..

**సినిమాల్లో** కన్నా.. సోషల్ మీడియాలోనే ఎక్కువగా కనిపిస్తుంది బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే. నెపోటిజం.. కాస్మెటిక్ సర్జరీ.. బాడీ షేమింగ్.. ఇలా నిత్యం ఏదో ఒక టాపిక్‌తో వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. తాజాగా, కెరీర్ తొలినాళ్లలో చాలామంది హీరోయిన్లలానే తానుకూడా బాడీ షేమింగ్‌ను ఎదుర్కొన్నాననీ చెప్పుకొచ్చింది. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ''నేను చాలా చిన్న వయసులోనే ఇండస్ట్రీకి వచ్చాను. ఆ 18 – 19 ఏళ్ల వయసులో నేను చాలా సన్నగా ఉండేదాన్ని. దాంతో ఇండస్ట్రీలో చాలామంది నా శరీరంపై కామెంట్స్ చేశారు. అగ్గిపుల్లలా ఉన్నానంటూ ఆటపట్టించారు. 'నీ కాళ్లు కోడికాళ్లలా ఉన్నాయి. నీ శరీరం కూడా సరైన ఆకారంలో లేదు' అంటూ కామెంట్స్ చేశారు. ఇప్పుడేమో నా శరీరం సహజంగానే మారుతుంటే.. 'ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంది' అంటున్నారు. ఆడవాళ్లు ఎలా ఉన్నా.. ఇలాంటి విమర్శలు కామన్. కాబట్టి, పట్టించుకోకుండా మన పని మనం చేసుకుంటూ పోతేనే.. విజయం సాధిస్తాం!'' అంటూ చెప్పుకొచ్చింది అనన్య. ఇక మగవాళ్లపై బాడీ షేమింగ్ విమర్శలు చాలా తక్కువగా ఉంటాయనీ, ఒకటో రెండో వచ్చినా.. వారిని అంతగా ఇబ్బంది పెట్టరనీ అంటున్నది. అదే, మహిళా నటులపై తరచుగా విమర్శలు గుప్పిస్తూనే ఉంటారనీ, వారిని ఎదగనీయకుండా అడ్డుకుంటారనీ ఆవేదన వ్యక్తం చేసింది. బాలీవుడ్ నటుడు చుంకీ పాండే కూతురిగా ఇండస్ట్రీలోకి వచ్చింది అనన్య. 2019లో వచ్చిన 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' చిత్రం ద్వారా బాలీవుడ్ బాట పట్టింది. తొలి సినిమాలోనే తనదైన నటనతో అలరించింది. ఆ తర్వాత.. పతి పత్నీ ఔర్ వో, ఖాలీ పీలీ, రాకీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ, డ్రీమ్ గర్ల్ 2, ఖో గయే హమ్ కహా లాంటి చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇటీవలే అక్షయ్ కుమార్ సరసన కేసరి – చాప్టర్ 2లో కనిపించింది. ప్రస్తుతం లక్ష్య సరసన 'చాంద్ మేరా దిల్' కోసం సిద్ధమవుతున్నది అనన్య. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ సోని దర్శకత్వం వహిస్తున్నాడు.



## పని చేయడానికే వచ్చా!

**1970లలో** బాలీవుడ్ అగ్రతారల్లో ఒకరిగా ఓ వెలుగు వెలిగిన నటి మౌషిమి ఛటర్జీ. ఆ సమయంలో బీటౌన్‌లో అత్యధిక పారితోషికం తీసుకున్న హీరోయిన్లలో ఒకరిగానూ ఆమె గుర్తింపు తెచ్చుకున్నది. అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఈ సీనియర్ నటి.. తోటి నటీనటులతో స్నేహపూర్వకంగా మెలగదనే విమర్శలు ఎదుర్కొన్నది. ఆ కారణంగానే పలు పెద్దపెద్ద ప్రాజెక్టుల నుంచి తనను తప్పించారని కూడా పలు సందర్భాల్లో చెప్పుకొచ్చింది. తాజాగా, ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న సవాళ్లు, గొడవలు.. తదితర సంగతులను పంచుకున్నది. 1981లో అమితాబ్ హీరోగా వచ్చిన 'బర్సాత్ కీ ఏక్ రాత్' నుంచి తనను అర్ధంతరంగా తొలగించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ.. పలు విషయాలను వెల్లడించింది. 70లలో అమితాబ్ బచ్చన్‌తో కలిసి మౌషుమి ఛటర్జీ మూడు చిత్రాలలో నటించింది. రోటీ కపడా ఔర్ మకాన్, బేనామ్, మంజిల్ చిత్రాలతో అమితాబ్ – మౌషుమీ జోడి.. హిట్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నది. ఇదే క్రమంలో 1981లో అమితాబ్ బచ్చన్ నటించిన 'బర్సాత్ కీ ఏక్ రాత్' కోసం హీరోయిన్‌గా మొదట మౌషుమినే తీసుకున్నారట. కానీ, షూటింగ్ మొదలుపెట్టే సమయానికి తనను కాదని బిగ్ బీ సరసన రాఖీ గుల్జార్‌ను ఎంపిక చేశారట. ఇదే విషయాన్ని చిత్ర నిర్మాత శక్తి సామంత్ తనకు ఫోన్ చేసి చెప్పినట్టు మౌషుమి గుర్తుచేసుకున్నది. ''ఆరోజు శక్తి అంకుల్ నాకు ఫోన్ చేశారు. 'బచ్చన్‌తో ఏమైనా గొడవ జరిగిందా?' అని అడిగారు. అలాంటిదేమీ లేదని చెప్పాను. 'ఒక దగ్గర పనిచేస్తున్నప్పుడు అభిప్రాయ భేదాలు రావడం కామన్! దానికే శత్రువుగా చూస్తే ఎలా?' అని కూడా చెప్పాను'' అంటూ శక్తితో జరిగిన



సంభాషణను వివరించింది. ఇక తాను ఇండస్ట్రీలోకి వచ్చింది పనిచేయడానికి మాత్రమేననీ, ఎవరినో స్నేహితులుగానో, శత్రువులుగానో మార్చుకోవడానికి కాదనీ చెప్పుకొచ్చింది. ఆ సంఘటన తర్వాత బిగ్ బీతో కలిసి 2015లో వచ్చిన 'పికు' సినిమాలో కలిసి నటించింది మౌషుమి. ఇందులో ఒక చిన్న క్యారెక్టర్ చేసింది. ఇదే ఇంటర్వ్యూలో మరో పాత ముచ్చట.. తనను ఫొటోగ్రాఫర్ 'జయా బచ్చన్' అని పిలవడంపై జరిగిన వివాదంపైనా స్పందించింది మౌషుమి. ఒక సందర్భంలో కొందరు ఫొటోగ్రాఫర్లు మౌషుమీని 'జయా బచ్చన్' అని సంబోధించారు. దాంతో, వారిపై విరుచుకుపడింది మౌషిమి. 'నన్ను జయా బచ్చన్ అని పిలవకండి. నేను చాలా మంచి వ్యక్తిని' అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మాటలు అప్పట్లో వివాదానికి దారి తీశాయి. తనకు పోలికలు నచ్చవనీ, 70లలో కొందరు బాలీవుడ్ హీరోయిన్ల మధ్య అంతర్లీనంగా ఉద్రిక్త వాతావరణం ఉండేదని మౌషిమి అంగీకరించింది. ఇక బెంగాల్‌కు చెందిన మౌషుమి ఛటర్జీ.. 1967లో వచ్చిన బెంగాలీ హిట్ చిత్రం 'బాలికా బధూ'తో తెరంగేట్రం చేసింది. 1972లో 'అనురాగ్' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. అప్పటి స్టార్ హీరోల్లో ఒకరైన వినోద్ మెహ్రా నటించిన ఈ సినిమా.. అద్భుత విజయం సాధించింది. దాంతో మౌషుమి ఒక్కసారిగా బాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా మారిపోయింది. రోటీ కపడా ఔర్ మకాన్, బేనామ్, ఉస్–పార్, మాంగ్ భరో సజ్నా, ప్యాసా సావన్, స్వయంవర్, ఆనంద్ ఆశ్రమం లాంటి ఎన్నో విజయవంతమైన సినిమాలను తన ఖాతాలో వేసుకున్నది. ఆ తర్వాత మౌషుమి రాజకీయాల్లో ప్రవేశించింది.

## ట్విస్టు మీద ట్విస్టు!

### గ్యాంగర్స్

ఓటీటీ హిట్

**అమెజాన్ ప్రైమ్ :** స్ట్రీమింగ్ అవుతున్నది.
**తారాగణం :** వడివేలు, సుందర్, కేథరిన్, మైమ్ గోపీ, భగవతీ పెరుమాల్, అరుళ్‌దాస్ తదితరులు, **దర్శకత్వం :** సుందర్ సి

**కొన్ని** కథలు చాలా కామన్‌గా కనిపిస్తాయి. ఓ సమస్య. దాన్ని పరిష్కరించే హీరో. అతణ్ని చూసి మనసు పారేసుకొనే ఓ హీరోయిన్. మామూలుగా చూపిస్తే 'యావరేజ్ సినిమా'నే వస్తుంది. కానీ, ఆ సమస్య ఏమిటి? దానిని హీరో ఎలా పరిష్కరించాడు? ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నాడు? అనే అంశాలే ఆ కామన్ కథను కూడా అదిరిపోయే చిత్రంగా మలుస్తాయి. ఇక మధ్యమధ్యలో వచ్చే ట్విస్టులు.. సినిమాను హిట్టు బాట పట్టిస్తాయి. అలా ప్రేక్షకులు ఏమాత్రం ఊహించలేని ట్విస్టులతో అలరిస్తున్న సినిమా.. గ్యాంగర్స్. గత నెలలో థియేటర్లలో విడుదలైన ఈ తమిళ డబ్బింగ్ చిత్రం.. తాజాగా అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చింది. హిట్ టాక్‌తో దూసుకెళ్తున్న ఈ సినిమా కథ.. ఓ పల్లె నేపథ్యంలో సాగుతుంది. ఆ ఊరిని మల్లేశ్ (మైమ్ గోపీ), కోటేశ్ (అరుళ్ దాస్) అనే అన్నదమ్ములు నియంత్రిస్తుంటారు. పల్లెను తమ అక్రమ వ్యాపారాలకు అడ్డాగా చేసుకొని.. అన్ని పనులనూ తమ కనుసన్నల్లోనే నడిపిస్తుంటారు. అయితే ఈ విషయాలేవీ బయటి ప్రపంచానికి తెలియదు. చెప్పడానికి ఎవరూ ప్రయత్నించరు కూడా! ఇలా ఉండగా.. అక్కడి ప్రభుత్వ పాఠశాలలో చదివే రమ్య అనే అమ్మాయి కనిపించకుండా పోతుంది. అదే స్కూల్‌లో సుజిత (కేథరిన్) టీచర్‌గా, సింగరం (వడివేలు) పీఈటీగా పని చేస్తూ ఉంటారు. 'రమ్య' కనిపించకుండా పోయిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్తుంది సుజిత. ఆ సమయంలోనే అదే స్కూల్‌కు పీఈటీగా వస్తాడు శరవణన్ (సుందర్). స్కూల్‌ను అడ్డుపెట్టుకుని మల్లేశ్ – కోటేశ్ చేస్తున్న అక్రమాలను శరవణన్ గమనిస్తాడు. వాళ్లను నడిపిస్తున్న పెద్ద తలకాయనూ గుర్తిస్తాడు. మరి.. శరవణన్ నిజంగానే ఆ ఊరికి 'పీఈటీగా వచ్చాడా? ఇంకేదైనా కారణం ఉందా? ఆయన ఫ్లాష్‌బ్యాక్ ఏంటి? అక్రమార్కులను నడిపిస్తున్న ఆ పెద్ద తలకాయ ఎవరు? రమ్య కనిపించకుండా పోవడానికి కారణం ఏమిటి? సినిమా నడుస్తున్న కొద్దీ.. ఇలాంటి మరెన్నో చిక్కుముడులు విడివడుతుంటాయి.

